క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన



పెంచికలపాడులోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి

గూడూరు రూరల్ : మండల పరిధిలోని పెంచికలపాడులో కొలువైన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయంలో ఆదివారం ఆరాధన ఉత్సవాన్ని గ్రామ ప్రజలు, భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఆరాధనలో భాగంగా ఉదయం నుంచి దేవాలయంలో వీరబ్రహ్మేంద్రస్వామి దంపతులకు ప్రత్యేక పూజలు, అభిషేకాలను చేపట్టారు. అనంతరం పురోహితులు వేద మంత్రోచ్చరణల మధ్య స్వామివారి కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. భక్తులకు గ్రామ ప్రజలు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కేసీ కాల్వకు 414 క్యూసెక్కుల నీరు

గూడూరు: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు 414 క్యూసుక్కుల నీటిని విడుదల చేశారు. కర్నూలు నగర ప్రజల తాగునీటి అవసరాల కోసం ఈ నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. డ్యాంలో ప్రస్తుతం 0.751 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పాఠ్యపుస్తకాల మంజూరు



మండల కేంద్రానికి చేరుకున్న పాఠ్యపుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈఓ అనంతయ్య

కోడుమూరు రూరల్: వచ్చే విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం మండలానికి మొదటి విడత కింద 35,036 పాఠ్యపుస్తకాలు మంజూరైనట్లు ఎంఈఓ అనంతయ్య ఆదివారం తెలిపారు. జగనన్న విద్యాకానుకలో భాగంగా ఇప్పటి వరకు మండలానికి 35,036 పాఠ్యపుస్తకాలతో పాటు, 1 నుంచి 5వ తరగతి విద్యార్థుల కోసం 4,257, 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు 6,029 యూనిఫాంలు మంజూరయ్యాయని చెప్పారు. వీటిని కోడుమూరు బాలుర హైస్కూల్లోని స్టాక్ పాయింట్‌కు తరలించినట్లు వెల్లడించారు. వీటిని త్వరలో ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేస్తామని చెప్పారు.

ఘనంగా పార్వతమ్మ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహాలకు పూజలు చేస్తున్న దృశ్యం

పాణ్యం : మండల పరిధిలోని కొండజుటూరు గ్రామంలోని బ్రహ్మంగారి ఆలయంలో పార్వతమ్మ విగ్రహ ప్రతిష్ఠను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి ప్రతిష్ఠ చేశారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేడు వాహనాల వేలం

ఓర్వకల్లు : వివిధ నేరాల్లో, అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుపడిన వాహనాలను వేలం వేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జున ఆదివారం తెలిపారు. 53 వాహనాలకు సోమవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న వేలం పాటలో పాల్గొనదలచినవారు తగిన ధరావత్తు చెల్లించి, ఆధార్ కార్డు జిరాక్స్ సమర్పించాల్సి ఉంటుదన్నారు. వేలం పాటలో దక్కించుకున్న వాహనానికి సంబంధించిన ధర మెత్తం అదే రోజు అధికారులకు చెల్లించి వాహనాలను స్వాదీనపరచుకోవాలని సూచించారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

కోడుమూరు రూరల్ : కోడుమూరులోని గ్రామ సచివాలయం – 3, 4ల పరిధిలోని కాలనీల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి గడపకు వెళ్లి ప్రజలకు వివరిస్తారన్నారు. అలాగే వారి సమస్యలను తెలుసుకుంటారన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీరీలు పాల్గొనాలని ఆదేశించారు.

కొటేషన్ల ఆహ్వానం

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో వెలసిన దుర్గాభోగేశ్వరస్వామి ఆలయంలో వివిధ విభాగాలకు సీల్డ్ కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు ఈఓ చంద్రశేఖరరెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏడాదికి గాను దేవస్థానంలో పడితరము స్టోరుకు, పూజా సరుకుల సరఫరాకు, ఆహ్వాన పత్రికలు, గోడపత్రికలు, ఫ్లెక్సీలు, రశీదు పుస్తకాల ముద్రణకు ఈ నెల 15వ తేదీ లోపు దేవస్థానం కార్యాలయంలో కొటేషన్లు సమర్పించాలన్నారు.

మిల్లెట్లపై మక్కువ

- పెరిగిన సిరిధాన్యాల సాగు
- రైతులకు ప్రభుత్వ సహకారం
- గణనీయంగా పెరిగిన సాగు విస్తీర్ణం



ఇనగండ్ల గ్రామం వద్ద సాగైన సజ్జ పంట

సి.బెళగల్: సి.బెళగల్ మండల రైతులలో మిల్లెట్ల సాగు (తృణ, సిరి ధాన్యాలు)పై మక్కువ పెరిగింది. ప్రభుత్వం సహకారం అందిస్తుండటంతో గతంలో ఎన్నడూ లేనంతగా 2022–2023 సంవత్సరంలో రబీ సీజన్‌లో రైతులు కొర్ర, సజ్జా, జొన్న, గోధుమలు, రాగులను సాగుచేసి అధిక దిగుబడులను సాధిస్తున్నారు. వీటికి తోడు మండల వ్యవసాయ అధికారుల కృషి, ప్రోత్సాహంతో సిరి ధాన్యాల సాగు గణనీయంగా పెరిగింది.

ప్రభుత్వ మద్దతు ధర

రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో తృణ ధాన్యాల సాగుకు ప్రోత్సాహకాలు ఈ ఏడాది భారీగా పెంచింది. మద్దతు ధర కల్పిస్తుండటంతో పల్లెల్లో సాగు భారీగా పెరిగింది. కొర్ర పంటకు ప్రభుత్వం క్వింటా రూ.2,500 లుగా ప్రకటించింది. అదేవిధంగా జొన్నలు రూ.2,990, సజ్జలు రూ.2,350, రాగులు రూ.3,578 లుగా నిర్ధారించింది.

రైతులకు అందుబాటులో అధికారులు

ఆర్బీకేల ద్వారా అధికార యంత్రాంతం నిరంతరం రైతులకు అందుబాటులో ఉంటూ సాగులో మెలకువలు, సలహాలు, సూచనలను అందిస్తున్నారు. దీనితో రైతులు సిరి ధాన్యాల సాగుకు ముందుకు వచ్చారు. పైగా ప్రభుత్వం రైతులు పండించిన ధాన్యాన్ని ఆర్బీకేల ద్వారా గ్రామాలలోనే కొనుగోలు చేస్తుందన్న సమాచారంతో మరింత ఎక్కువ మంది రైతులు ఆసక్తి కనపరిచారు.

సమృద్ధిగా నీరు

మండలంలో చిరుధాన్యాలు సాగైన వివరాలు ఇలా....

పంటలు	2021-2022లో	2022-2023లో
కొర్ర	250	602
సజ్జలు	210	265
జొన్న	332	470
రాగులు	18	34
మొత్తం	810	1,371 (సాగు ఎకరాలలో)

ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో సరైన సమయంలో వర్షాలు లేక కొంతమేర ఇబ్బందులు పడ్డ రైతులకు రబీ సీజన్‌లో ఎత్తిపోతల పథకాలతో పాటు, వర్షాలు, చెరువులలో సాగునీరు అందుబాటులో ఉంది. రబీలో మండలంలోని దాదాపు అన్ని గ్రామాలలో కొర్ర, సజ్జ, జొన్న వంటి పంటలను విరివిగా పండిస్తున్నారు.

తక్కువ వ్యవధిలోనే పంట చేతికి

హైబ్రిడ్ విత్తనాల పంటల కంటే తక్కువ వ్యవధిలోనే పంట చేతికి వస్తుండటంతో రైతులు సిరిధాన్యాల సాగుకు ముందుకు వచ్చారు. ప్రస్తుతం కొన్ని రకాల కొర్ర విత్తనాలు 80 నుంచి 100 రోజులలోగా దిగుబడి వస్తుండటంతో రైతాంగం వీటిపైనే ఆసక్తి చూపుతున్నారు. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. పెట్టుబడిపోను రైతుకు దాదాపు రూ.20 వేలకు పైగా లాభం వచ్చే అవకాశం ఉంది.

మంచి దిగుబడి వచ్చింది



ఈ సంవత్సరం నేను రెండో పంటగా రెండు ఎకరాల పొలంలో కొర్ర పంటను సాగు చేశా. నాలాగే మా ఊరిలో చాలామంది రైతులు కొర్ర, సజ్జ పంటలను వేశారు. పంటలకు వాతావరణం అనుకూలించడంతో పాటు సాగునీరు ఉండటంతో మొక్కలు బలంగా ఉండి కంకులు పెద్దవిగా వచ్చాయి. దీనితో ఎకరాకు 9.50 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. చాలా సంతోషంగా ఉంది.

– ఉలిగి వెంకటేశ్వర్లు, రైతు, పోలకల్.

ప్రభుత్వం, అధికారుల సహకారంతోనే



తృణ ధాన్యాలను పండించుకునేందుకు ప్రభుత్వం, అధికారులు మంచి సాహకారంను అందించారు. చాలా ఎళ్లక్రితం పండించుకునే పంటలను మరోసారి మా పొల్లాల్లో పండించడం ఆనందాన్ని ఇచ్చింది. పంట సాగుకు నీళ్లు అందుబాటులో ఉండటంతో నాకు ఎకరాకు 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మాకు ఇప్పుడు ఇంట్లో తిండిగింజలతో పాటు పశువులకు అవసరమైన మేతకూడ దొరికింది.

– నరసింహారెడ్డి, చింతమానుపల్లె రైతు.

రబీ సీజన్‌లో ఎక్కువగా సాగు అయ్యింది



ఈ ఏడాది రబీ సీజన్‌లో మండల వ్యాప్తంగా ఎక్కువ విస్తీర్ణంలో తృణ ధాన్యాలను రైతులు సాగు చేసుకున్నారు. తక్కువ పెట్టుబడితో పంటలు పండించుకోవడంతో పాటు, అధిక దిగుబడులు సైతం సాధించేందుకు వీలుండటంతో ఎక్కువ మంది వీటిని సాగు చేసుకున్నారు. ముందస్తు పంటల సాగుకు ముందుకు వస్తే విత్తనాలు బనవాసి కృషి విజ్ఞాన్ కేంద్రంలో అవసరమైనంత మేర అందుబాటులో ఉన్నాయి. ఆసక్తి ఉన్న రైతులు ఆర్బీకేలను సంప్రదించ వచ్చు.

– మల్లేష్‌కుమార్, మండల వ్యవసాయ అధికారి, సి.బెళగల్.

సమస్యల పరిష్కారానికి వేదిక 'స్పందన'

కర్నూలు (న్యూటౌన్): గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి 'స్పందన' ప్రత్యేక వేదికగా నిలిచిందని కర్నూలు రూరల్ తహసీల్దార్ ఆర్ శివరాముడు అన్నారు. సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమంలో మండల పరిధిలోని 12 రెవెన్యూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రతి సోమవారం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయంలో 'స్పందన' కార్యక్రమం ఉంటుందని ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు 'స్పందన'

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శేషఫణి ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు ఏవైనా సమస్యలుంటే అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

స్పందనకు హాజరుకాకపోతే చర్యలు

సి.బెళగల్: సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ శివశంకర్‌నాయక్ ఆదేశించారు. స్పందనకు గైర్హాజరయ్యే అధికారులపై నివేదకలను కలెక్టర్ కార్యాలయానికి పంపించడంతో పాటు ఉన్నతాధికారులకు చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తామని హెచ్చరించారు.

ధ్యానంతో ఒత్తిడి దూరం

కర్నూలు(సెంట్రల్) : ధ్యానం, యోగాలతో మానసిక ఒత్తిడిదూరమవుతుందని శ్రీసత్య సాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు మాక అశోక్ కుమార్ అన్నారు. ఆదివారం నగరంలోని నెహ్రూ నగర్ శ్రీ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత వేసవి శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మన్ కీ బాత్‌తో ప్రధాని ప్రజలతో మమేకం

- మేయర్ బీవై రామయ్య



రేడియోలో ప్రధాని మన్ కీ బాత్ వింటున్న మేయర్ రామయ్య

కల్లూరు : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రతి నెల చివరి ఆదివారం రేడియో ద్వారా నిర్వహించే 'మన్ కీ బాత్ కార్యక్రమంతో దేశ ప్రజలతో మమేకమవుతున్నారని నగర మేయర్ బీవై రామయ్య అన్నారు. ఆదివారం మన్ కీ బాత్ కార్యక్రమం 100వ ఎపీసోడ్ పూర్తి చేసుకున్న సందర్భంగా కోడుమూరు రోడ్డులోని ఆల్ ఇండియా రేడియో స్టేషన్‌లో ప్రధానమంత్రి మన్ కీ బాత్ ప్రసంగాన్ని మేయర్ రామయ్య విన్నారు. అనంతరం రేడియో స్టేషన్‌ను పరిశీలించారు. మేయర్ రామయ్య మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ 2014 అక్టోబర్ 3న ప్రారంభించిన మన్ కీ బాత్ కార్యక్రమం దిగ్విజయంగా సాగుతోందన్నారు. ఇది దేశ నెలవారీ సమీక్షగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణచైతన్య, టి.వి.సుబ్బారెడ్డి, చంద్రశేఖర కల్యాకర, రిటైర్డ్ ప్రిన్సిపాల్ కొట్టే చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి ప్రతిష్ఠ మహోత్సవాలు



వేడుకలకు సిద్ధమైన శ్రీ సుంకులాపరమేశ్వరి దేవి ఆలయం

కల్లూరు : మండల పరిధిలోని బస్తిపాడు గ్రామంలో వెలసిన శ్రీ గ్రామ నాఖిలింగ, శ్రీ సుంకులాపరమేశ్వరి దేవి విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవాలు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరగనున్నాయి. 3న ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనము తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. 4న ఉదయం ప్రాతఃకాలపూజ, నవగ్రహ మూల జపాదులు సాయంత్రం మహాస్నపనము, ధాన్యాధివాసము, అధివాస హోమములు, 5న అభిషేకము, గర్తపూజ, యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ ప్రతిష్ఠా హోమము పూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయి.

6న ఎద్దుల బండలాగుడు పోటీలు

6వ తేదీ న్యూ క్యాటగిరీ విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నారు. న్యూక్యాటగిరి విభాగంలో ఎద్దులను తోలుటకు ఏడుగురిని మాత్రమే అనుమతిస్తారు. విజేతలకు వరుసగా రూ. 50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు బహుమతులు అందజేయనున్నారు.

శ్రమ జీవుల వేడుక

- జిల్లాలో 4 లక్షల మంది కార్మికులు
- కష్టజీవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి
- వివిధ పథకాలు అమలు
- నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం



హమాలీ కార్మికుడు

కర్నూలు(రాజ్‌విహార్): శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేదని శ్రీశ్రీ అన్నట్లు శ్రమకు మించిన ఆయుధం లేదు. శ్రమ శక్తి లేనిదే ఏ దేశ అభివృద్ధి జరగదు. అందుకే శ్రమను గౌరవించాలి..శ్రామికులను ఆదరించాలంటారు. నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం. కష్టానికి తగిన గుర్తింపు, సరైన వేతనం, రోజుకు 8 గంటల పని హక్కును పోరాడి సాధించుకున్న రోజు(మే 1). సంపద సృష్టికర్తలైన కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోంది.

జిల్లాలో 1.25లక్షల మంది సంఘటిత, 1.5లక్షల మంది అసంఘటిత, భవన, బీడీ, ఇతర నిర్మాణ రంగ కార్మికులు మరో లక్ష మంది ఉంటారని అంచనా. డ్రైవర్లు 37 వేల మందికి పైగా, దుకాణ, ఇతర సంస్థల్లో పనిచేసే కార్మికులు 29,121 మంది, మిగిలిన కార్మికులు మరో పాతిక వేల మంది ఉంటారని కార్మిక శాఖ లెక్కలు చెబుతున్నాయి. చట్టం ప్రకారం భవన నిర్మాణ కార్మికులకు పని చేయించే చోట కనీస సౌకర్యాలు కల్పించాలి. ముఖ్యంగా మంచినీటి సౌకర్యంతో పాటు నీడ వసతి, టాయ్‌లెట్, బాత్రుం సౌకర్యం కల్పించాలి. అపార్ట్‌మెంట్లు నిర్మించే చోట చుట్టూ నెట్ (వల తరహా తార్పల్ పట్టలు) అమర్చాలి. దీనివల్ల ప్రమాదాలు నివారించవచ్చు. ఎండ తీవ్రంగా ఉన్న రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 4గంటల మధ్య బహిరంగ ప్రదేశాల్లో పనుల చేయించరాదు. అయితే, ఈ నిబంధనలు అమలులో జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

కార్మికులకు ప్రభుత్వం అండ

ప్రభుత్వం కార్మికులు, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం పలు పథకాలు ప్రవేశపెట్టింది. ముఖ్యంగా ప్రమాద బీమా సౌకర్యంతో పాటు కార్మికులు గుర్తింపు కార్డులు, వారి పిల్లల ఉపకారవేతనాలు వంటి అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నారు. గుర్తింపు కార్డు కలిగిన భవన నిర్మాణ కార్మికులకు ప్రమాద, సహజ మరణ బీమా సౌకర్యం కలిగిస్తోంది. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకుంటే ప్రోత్సాహం కింద రూ.5వేలు, కుమార్తె, మహిళా కార్మికురాలు వివాహానికి రూ.20 వేలు, ఈ–శ్రామ్ గుర్తింపు కార్డులు కలిగిన తాపీ మేస్త్రీలతో పాటు వివిధ నిర్మాణ రంగాల్లో ఉన్న అసంఘటిత కార్మికులకు రూ.2 లక్షల ప్రమాద బీమా, ప్రధానమంత్రి శ్రమ్ యోగి మాన్‌ధన్ (పీఎం–ఎస్‌వైఎం) పథకం కింద 18 ఏళ్లు నిండిన ప్రతి కార్మికుడు దరఖాస్తు చేసుకుంటే నెలకు రూ.15 వేలు పొందే వీలు ఉంటుంది. టైలరింగ్ వృత్తిలో స్థిరపడిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా రూ.10 వేలు ఇస్తోంది.

కార్మిక సంక్షేమానికి చర్యలు

జిల్లాలో ఉన్న సంఘటిత, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి చర్యలు చేపట్టాం. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను అర్హులైన వారి చెంతకు చేర్చేందుకు ప్రణాళిక ప్రకారం కృషి చేస్తున్నాం. ముఖ్యంగా భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులు కలిగి ఉండడం ద్వారా అనేక ప్రయోజనాలు ఉన్నాయి. అలాగే పనిచేసే చోట యజమానులు, నిర్వాహకుల నుంచి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.మేడే సందర్భంగా కార్మికులకు శుభాకాంక్షలు.

– బాలు నాయక్, జేసీఎల్, కర్నూలు.

నేటి నుంచి రెమీడియల్ తరగతులు

ఓర్వకల్లు : ఇంటర్మీడియెట్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు సోమవారం నుంచి రెమీడియల్ తరగతులు ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపాల్ గురువయ్యచెట్టి ఆదివారం తెలిపారు. స్థానిక ఆర్‌సీ ఎల్లారెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ ఏడాది నిర్వహించిన వార్షిక పరీక్షలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో 41 మంది విద్యార్థులకు గాను 12 మంది పాసై 29 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఇందులో మల్లికార్జున(ఎంపీసీ) 430 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలువగా, శ్రీకరాచారి(హెచ్ఈసీ) 350 మార్కులు, కె.రాముడు(హెచ్ఈసీ) 348 మార్కులు సాధించారన్నారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరంలో 41 మందికి గాను 13 మంది ఉత్తీర్ణత సాధించి 31 శాతం పాసైనట్లు తెలిపారు. ఇందులో సలోమి (సీఈసీ) 820 మార్కులు సాధించగా, కావేరి (సీఈసీ) 802 మార్కులు, రాణి(ఎంపీసీ) 755 మార్కులు సాధించి కళాశాల టాపర్లుగా నిలిచినట్లు వెల్లడించారు. ఇందులో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈ నెల 1 నుంచి 23వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు రెమీడియల్ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

నేరాల కట్టడికి చర్యలు

కర్నూలు (టౌన్) : కర్నూలులో నేరాల కట్టడికి, శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని కర్నూలు టౌన్ డీఎస్పీ విజయ శేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక కర్నూలు డీఎస్పీ కార్యాలయంలో ఆయన పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెడుతానన్నారు. అంతకు ముందు నూతన డీఎస్పీని పోలీసులు అధికారులు, సిబ్బంది స్వాగతం పలికి బొకేలు అందజేశారు.

కోట్లదే పైచేయి.. చెల్లుబాటుకాని విష్ణు డిమాండ్లు!

కోడుమూరు : యువగళం పేరుతో కొనసాగుతున్న నారా లోకేష్ పాదయాత్రపై కోడుమూరు నియోజకవర్గంలో పెత్తనమంతా మాజీ మంత్రి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికే అప్పగించినట్లు సమాచారం. ఏప్రిల్ 29న తెలుగుదేశం పార్టీ రీజినల్ ఇన్‌చార్జ్ అమర్నాథ్‌రెడ్డి విష్ణువర్దన్ రెడ్డి ఇంటికెళ్లి పాదయాత్ర విజయవంతం చేయాలని కోరారు. ప్రజాబలం నావెంట ఉంది. సర్పంచు, ఎంపీటీసీ ఎన్నికల్లో నామద్దతు దారులే అధికంగా గెలిచారు.. కాబట్టి పాదయాత్ర నేను చెప్పినట్లుగా జరగాలని విష్ణు డిమాండ్ చేశారు. ఎమ్మిగనూరు నుంచి సి.బెళగల్, గూడూరుల మీదుగా సుంకేసుల, ఎదురూరు, మునగాలపాడు నుంచి కర్నూలుకు చేరుకునే విధంగా యువగళం రూట్‌మ్యాప్‌ను తయారు చేయాలని విష్ణు కోరారు. అయితే అమర్నాథ్‌రెడ్డి విష్ణు డిమాండ్‌ను పక్కనబెట్టారు. యువగళం పాదయాత్ర ఎమ్మిగనూరు నుంచి గోనెగండ్ల, కోడు మూరుల మీదుగా పాణ్యం నియోజకవర్గంలోకి ప్రవేశించే విధంగా కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి రూట్‌మ్యాప్ ఖరారు చేశారు. దీంతో విష్ణు వర్గం పాదయాత్రకు దూరంగా ఉండి, తాము లేని లోటు ఏవిధంగా ఉంటుందో చూపించాలని భావిస్తున్నట్లు సమాచారం.

సాఫ్ట్‌బాల్ జూనియర్ బాల బాలికల జట్ల ఎంపిక

కర్నూలు (టౌన్): నగరంలోని స్థానిక ఏ.క్యాంపు మాంటిస్సోరి పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం జూనియర్ సాఫ్ట్‌బాల్ బాల బాలికల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీలను అలంపూర్ జెడ్పీటీసీ ఇస్మాయిల్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 26 నుంచి 28 వరకు కడప జిల్లాలో నిర్వహించనున్న 10 వ రాష్ట్ర స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి విజయ్ పాల్గొన్నారు.

భూపనపాడు బీసీ కాలనీని అభివృద్ధి చేస్తాం



భూపనపాడుల గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాటసాని, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

- ఎంపీ, పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి
- తిరునాలతో ప్రత్యేక పూజలు

పాణ్యం : మండల పరిధిలోని భూపనపాడు గ్రామంలోని బీసీ కాలనీలో ఉన్న సమస్యలను పరిష్కరించి అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలోని గ్రామ దేవతల తిరునాల మహోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యేతో పాటు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, పలువురు ప్రముఖులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలోని నాయకుల ఆహ్వానం మేరకు విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సీసీ రోడ్లును ఇష్టానుసారంగా వేశారని, రోడ్లను తగ్గులో వేయడంతో వర్షా కాలంలో నీరు రోడ్లుపై నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పలుమార్లు గ్రామ ప్రజలు, నాయకులు తమ దృష్టికి తెచ్చారన్నారు. తక్షణమే ఇంజినీర్లతో అంచనా వేయించి నిధులు కేటాయిస్తామన్నారు. త్వరలోనే వీలైనంత వరకు పనులు పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలోని అంతర్గత రోడ్లు, ఇతర ప్రభుత్వ సముదాయ భవనాల పూర్తి చేయించి సత్వర సేవలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ జనార్దన్, నాగేషుడు, రామలక్ష్మయ్య, సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ సభ్యులు బండి సుధారాణి, మనోహర్, మహేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిమ్మారెడ్డి మృతికి ప్రముఖుల నివాళి

పాణ్యం గ్రామానికి చెందిన ప్రముఖ రైతు సంఘం నాయకుడు యమారెడ్డి తిమ్మారెడ్డి (82)అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. అలాగే బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కుమారుడు కాటసాని ఓబులరెడ్డి, కాటసాని ప్రసాద్‌రెడ్డి, కాటసాని తిరుపాల్‌రెడ్డితో పాటు పలువురు నాయకులు తిమ్మారెడ్డికి నివాళి అర్పించారు. కుమారుడు బుజ్జిరెడ్డిని ఓదార్చారు.

ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండాలి



మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణను సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

కర్నూలు (న్యూటౌన్): సమాజంలో ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని కలిగి ఉండాలని కోడుమూరు మాజీ ఎమ్మెల్యే, మాజీ టీటీడీ పాలక మండలి సభ్యుడు పరిగెల మురళీకృష్ణ అన్నారు. ఆదివారం తన నివాసంలో పుట్టిన రోజు సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు మురళీకృష్ణను గజమాలతో సత్కరించి భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో అంకితభావంతో పని చేసే నాయకులకు, కార్యకర్తలకు మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. రాబోయే 2024 ఎన్నికల్లో కోడుమూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలందరూ సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కాల్వ ముని, మాజీ ఉప సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు అనిల్‌కుమార్, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు

గూడూరు రూరల్ : మాజీ టీటీడీ సభ్యుడు, ఉమ్మడి కర్నూలు జిల్లా వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జోనల్ ఇన్‌చార్జ్ పరిగెల మురళీకృష్ణ జన్మదిన వేడుకలను ఆదివారం బూడిదపాడు వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మన్న, సుధాకర్, నాగన్న, భాస్కర్, మౌలాలిలు ఘనంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేయించిన కేక్‌ను కట్ చేసి మురళీకృష్ణకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఆత్మీయ సమ్మేళనం

గడివేముల: వీరంతా గడివేముల జిల్లా పరిషత్ పాఠశాలలో 1979–84 సంవత్సరం వరకు కలిసి చదువుకున్నారు. 6 నుంచి 10 వతరగతి వరకు చదువుకొని వివిధ ప్రాంతాల్లో స్థిర పడిన పూర్వ విద్యార్థులు, ఆదివారం ఆ పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. కలిసి చదువుకున్న విద్యార్థులందరూ ఒక్కసారిగా కలవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ.. యోగక్షేమాలు తెలుసుకుంటూ.. చిన్ననాటి అనుభవాలను నెమరువేసుకున్నారు. అందురూ కలిసి సహపంక్తి భోజనం చేశారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులైన సీతమ్మ, వెంకటసుబ్బన్న, తిరివెంగళయ్యలను ఘనంగా సన్మానించారు. పాఠశాలలో క్రీడాభివృద్ధికి కృషి చేస్తామని పూర్వవిద్యార్థి, జెడ్పీటీసీ ఆర్‌బీ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. పూర్వ విద్యార్థులు గంగాధర్‌రెడ్డి, రమణారెడ్డి, ఎం శ్రీనివాసులు, మంగమ్మ, కల్పలత, ఫర్జానా బేగం తదితరులు ఉన్నారు.



ఉపాధ్యాయులతో పూర్వపువిద్యార్థులు